సాక్షి
కుమురం భీం
బుధవారం । 1 । నవంబర్ । 2023



లెక్క దాటితే చిక్కే!
ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు హద్దులు దాటకుండా ఈసీ మార్గదర్శకాలు విడుదల చేసింది. లెక్కలు హద్దు దాటితే అనర్హత వేటు పడే ప్రమాదం ఉంది. 10లో▸



ఇంధనం లేక ఇక్కట్లు..!
తిర్యాణి మండలంలోని పెట్రోల్ బంక్ నిల్వలు లేక అలంకారప్రాయంగా మారింది. ప్రజలు దాదాపు 30 కిలోమీటర్ల దూరంలోని బంక్‌కు వెళ్లాల్సి వస్తోంది. 11లో▸

గరిష్టం/కనిష్టం
33.2 /21.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం కాస్త ఎండగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

కొనుగోళ్లకు సన్నద్ధం..!

- ఈ నెల రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 56,300 ఎకరాల్లో వరి సాగు
- జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం


దహెగాంలో ఆరబెట్టిన ధాన్యం

దహెగాం(సిర్పూర్): వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నెల రెండోవారం నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. కొనుగోళ్లకు సంబంధించి ఇదివరకే అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం కూడా నిర్వహించారు. క్షేత్రస్థాయిలో కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా జిల్లావ్యాప్తంగా 34 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో సహకార సంఘం ద్వారా 30, ఐకేపీ ద్వారా 4 ప్రారంభించనున్నారు. ఈ ఏడాది 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

అందుబాటులో గన్నీ సంచులు..
వర్షాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 56,300 ఎకరాల్లో వరి సాగైంది. 42 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే గన్నీ సంచులు అందుబాటులో ఉంచారు. మరో లక్ష గన్నీసంచులు అవసరం ఉండవచ్చని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. జిల్లావ్యాప్తంగా 21 రైస్‌మిల్లులు ఉన్నాయి. నాలుగు బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు తరలించనున్నారు.

నాణ్యమైన ధాన్యానికి 'మద్దతు'
ప్రభుత్వ నిబంధన ప్రకారం నాణ్యమైన ఏ గ్రేడు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర రూ.2,203 చెల్లించనున్నారు. బీ గ్రేడు ధాన్యానికి రూ.2,183గా నిర్ణయించారు. తేమశాతం 17కు మించి ఉండకుండా తూర్పారా పట్టి తప్ప, తాలు లేకుండా తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా తూర్పారా యంత్రాలను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచనున్నారు. రెండేళ్లుగా ధాన్యం ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. వరికి తెగుళ్లు సోకడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. వరి కోతలైన తర్వాత కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో అకాల వర్షాలు పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అన్నదాతలు కోరుతున్నారు.

సాఫీగా సాగేనా..?
వరి కోతలకు సమయం వచ్చింది. పలు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కోతలు జోరందుకుంటున్నాయి. మరో పది రోజుల తర్వాత వేగం పుంజుకునే అవకాశం ఉంది. యాసంగి సీజన్‌లో వరి కొనుగోళ్లు సాఫీగా సాగలేదన్న విమర్శలు వచ్చాయి. తూకంలో కోత విధించడం, మిల్లర్లు కూడా క్వింటాళుకు 5 నుంచి 10 కిలోల వరకు కోత విధించారని ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్లు ధాన్యంలో కోత విధించవద్దని రైతులు ధర్నాలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ వానాకాలంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనుగోళ్లు సాఫీగా సాగుతాయా లేదా అనేది చూడాల్సి ఉంది.

బయోమెట్రిక్ అమలు..
ధాన్యం పండించి కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి తీసుకువచ్చే రైతుల నుంచి ఈ ఏడాది బయోమెట్రిక్ తీసుకోనున్నారు. పారదర్శకత కోసమే బయోమెట్రిక్ అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కౌలు రైతులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. పట్టా పాస్‌పుస్తకాలతో యాజమాని కొనుగోలు కేంద్రానికి వెళ్లకతప్పదు. ఒక విధంగా ఇది కట్టడి చేయడానికి తీసుకున్న నిర్ణయమని అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కోత విధించొద్దు



వానాకాలం సీజన్‌లో వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి కోత విధించకుండా కొనుగోలు చేయాలి. యాసంగిలో మిల్లర్లు క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోల వరకు కోత పెట్టారు. దీంతో చాలా తీవ్రంగా నష్టపోయినం.
– ఇప్పు లక్ష్మణ్, గెర్రె, మం.దహెగాం

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. కలాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. దీపావళి తర్వాత అడపాదడపా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఏటా పంటను కాపాడుకునేందుకు కవర్లు అద్దెకు తెచ్చుకుంటున్నాం.
– భీంరావు, గుడ్లబోరి, మం.కౌటాల

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

నవంబర్ రెండో వారంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. దళారులకు అమ్మి మోసపోకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధర పొందాలి. 17 శాతం మించి తేమ లేకుండా చూసుకోవాలి. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి.
– తారామణి, డీసీవో

న్యూస్‌రీల్

విద్యార్థులకు పుస్తక పఠనం అవసరం


విద్యార్థులతో మాట్లాడుతున్న జెన్నిఫర్

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో అవసరమని సెరి ప్రాజెక్టు జిల్లా ఇన్‌చార్జి జెన్నిఫర్ అన్నారు. కెరమెరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జైనూర్ మండలం వడ్డెరగూడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రూం టూ రీడ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులతో గ్రంథాలయ పుస్తకాలను వారంలో కనీసం మూడు రోజులపాటు చదివించాలని సూచించారు. కనీస సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేయాలన్నారు. స్టోరీ బుక్స్, ఫ్లాష్ కార్డులు వినియోగించడం ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, పీఎస్ హెచ్‌ఎం భాస్కర్, సిరి ప్రాజెక్టు బ్లాక్ కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా వని నియోజకవర్గ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీటీసీ నీరటి రేఖ నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుంచి పాల్వాయి హరీశ్‌బాబును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న 30 రోజులపాటు అహర్నిశలు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 10న రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పోచం, మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, నాయకులు కొంగ సత్యనారాయణ, శ్రీశైలం, నీరటి సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, ఎన్.మహేశ్, సాయి బనార్కర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నీచ రాజకీయాలకు నిదర్శనం

- ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం బాధాకరం
- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

రెబ్బెన(ఆసిఫాబాద్): దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు నిదర్శనమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని, భౌతిక దాడులకు పాల్పడడం, హత్యాయత్నానికి పూనుకోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సీట్లు అమ్ముకున్న నీచపు సంస్కారం రేవంత్‌రెడ్డిదని, కాంగ్రెస్ పార్టీ అంటేనే రౌడీ రాజకీయాలకు పెట్టింది పేరని ఆరోపించారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి, దాడికి పాల్పడింది బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తగా చిత్రీకరించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం అంటే హుందాగా ఉండాలని, ఇలాంటి దాడులను ఉపేక్షించేదీ లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఎంపీటీసీ మధునయ్య, రైతుబంధు సమితి జిల్లా సభ్యురాలు శంకరమ్మ, నాయకులు అజయ్ జైస్వాల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సభ జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఈ నెల 5న ఉదయం 10 గంటలకు నిర్వహించే విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాంచాలపు లక్ష్మణాచారి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లాలోని మండల, గ్రామ స్థాయి నుంచి కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'బీఆర్‌ఎస్‌తోనే కార్మికుల హక్కుల రక్షణ'

రెబ్బెన(ఆసిఫాబాద్): బీఆర్‌ఎస్‌తోనే సింగరేణి కార్మికుల హక్కులకు రక్షణ ఉంటుందని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి కార్మిక వాడల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను కార్మిక కుటుంబాలకు అందించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు లాభాల వాటా పెంచి ఇస్తున్నారని పేర్కొన్నారు. క్వార్టర్ల కరెంట్ బిల్లు రద్దు చేయడంతోపాటు ఏసీలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. కోవ లక్ష్మిని గెలిపించాల్సిన బాధ్యత సింగరేణి కార్మికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు వెంకటేశం, నాయకులు స్వామి, కిరణ్, రమేశ్, బాబురావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కార్మికుల కుటుంబాలకు మేనిఫెస్టో పత్రాలు అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మూడు రోజుల్లో అధిష్టానం పిలిచి మాట్లాడాలి

- లేకుంటే ఎన్నికల బరిలో ఉంటా
- టీపీసీసీ సభ్యుడు గణేశ్ రాథోడ్


మాట్లాడుతున్న గణేశ్ రాథోడ్

ఆసిఫాబాద్: కాంగ్రెస్ అధిష్టానం మూడు రోజుల్లో పిలిచి మాట్లాడకుంటే కార్యకర్తల అభీష్టం మేరకు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటానని టీపీసీసీ సభ్యుడు గణేశ్ రాథోడ్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 'గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌తో గెలిచిన సక్కు బీఆర్‌ఎస్‌లో చేరిండు.. అలాంటి సమయంలో ఐసీయూలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బతికించిన.. ఇంద్రవెల్లి సభకు లక్ష మందిని తరలించడంతోనే రేవంత్‌ను హీరో అయ్యిండు.. భట్టి పాదయాత్రకు రూ.50 లక్షలు ఖర్చు చేసిన.. చివరకు అధిష్టానం డబ్బులకు అమ్ముడుపోయి అవినీతి అధికారికి కాంగ్రెస్‌కు టికెట్ ఇచ్చింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న తనకు టికెట్ ఇవ్వకుండా 40 రోజుల ముందు వచ్చిన వారికి ఎలా టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మూడెకరాల భూమి రిజిస్టర్ చేయడంతోనే ఆయనకు టికెట్ ఇచ్చారని ఆరోపించారు. ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. హైకమాండ్ ఇప్పటికైనా ఆసిఫాబాద్ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. పార్టీకి డబ్బులు సరిపోకుంటే టెండర్ పెట్టి గాంధీ భవన్‌ను అద్దెకివ్వాలని ఎద్దేవా చేశారు. సమావేశంలో రెబ్బెన మాజీ జెడ్పీటీసీ దుర్గం సోమయ్య, ఈదులవాడ మాజీ సర్పంచ్ గడ్డల సత్తయ్య, నాయకులు డాక్టర్ సత్తార్, ఎండీ నిజాం, ఎండీ ఇస్మాయిల్, బాబు, ఆసిఫ్, గోవింద్, జాదవ్ రమేశ్, విద్యాసాగర్, ఇగురపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

- గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్
- ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్ జిల్లాల ఎస్పీలతో సమీక్షా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఎస్ఐబీ ఐజీ టి.ప్రభాకర్‌రావుతో కలిసి ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వారు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మావోయిస్టు కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సమాచారాన్ని పరస్పరం అందించుకోవాలన్నారు. దీని ద్వారా మావోయిస్టుల కట్టడి సులభతరం అవుతుందన్నారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల విడుదల వరకు ప్రతీ దశలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. జిల్లాలకు అదనంగా కేటాయించిన కేంద్ర పారా మిలటరీ బలగాలతో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించి భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచి నగదు, మద్యం అక్రమ సరఫరా వంటి అనైతిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐబీ అధికారి పి.వేణుగోపాలరావు, కుమురంభీం ఎస్పీ సురేశ్‌కుమార్, ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నిర్మల్ ఎస్పీ సీహెచ్.ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయరాఘవన్, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేశ్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ క్షమాపణ చెప్పాలి'

ఆసిఫాబాద్అర్బన్: హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు సైతం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌటాల మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డల ప్రణయ్, నాయకులు పిప్రి సాయి, గడ్డల కిరణ్, సంజయ్ పాల్గొన్నారు.

ఆటోస్టాండ్‌కు స్థలం కేటాయించాలి

- డ్రైవర్లకు ఏడాదికి రూ.పదివేలు చెల్లించాలి
- హెల్త్‌కార్డులు అందించాలి
- ప్రజా ఎజెండాలో ఆటోడ్రైవర్ల అభిప్రాయం

ప్రజా ఎజెండా


జిల్లా కేంద్రంలోని ఆటోస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు

ఆసిఫాబాద్: 'జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆటోస్టాండ్ లేకపోవడంతో పోలీసులు చలాన్లు విధిస్తున్నారు. వెంటనే ఇక్కడ ఆటోస్టాండ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి' అని జిల్లా కేంద్రంలోని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్‌లోని ఆటో డ్రైవర్లతో 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఎజెండా కార్యక్రమంలో పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇవ్వడం తప్పితే గెలిచిన నాయకులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు భద్రత కల్పించాలని, ఉచితంగా లైసెన్సులు ఇప్పించాలన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం చెల్లిస్తున్న విధంగా డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు చెల్లించాలని కోరారు.

ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలి



బస్టాండ్ సమీపంలో ఆటో స్టాండ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి. ఆటో స్టాండ్ లేకపోవడంతో రోడ్డు పక్కన ఆటోలు నిలపాల్సి వస్తోంది. పోలీసులు తరచూ చలాన్లు రాస్తున్నారు. రోజురోజుకూ ఆటోల సంఖ్య పెరగడంతో కనీసం కూలి కూడా పడడం లేదు. ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.
– అస్లాం, ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు

రూ.10 వేలు చెల్లించాలి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరి బ్యాచ్ నంబర్ ఉన్న ఆటో డ్రైవర్లకు ఏటా ప్రభుత్వం నుంచి నేరుగా రూ.10వేలు చెల్లించాలి. లైసెన్సులు సైతం ఉచితంగా అందించాలి. ఇంటి స్థలాలు కేటాయించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి. ఆటో కాలనీ ఏర్పాటు చేయాలి.
– నేరెళ్ల వెంకన్న, ఆటో డ్రైవర్

ఎలాంటి సాయం అందలేదు



ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. ముందుగా వారి జీవితాలకు భద్రత కల్పించాలి. వ్యవసాయ భూమి కేటాయించి వారి కుటుంబాలను ఆదుకోవాలి. విద్యుత్ బిల్లులు సైతం భారంగా మారాయి.
– ఫార్దోస్ ఖాన్, ఆసిఫాబాద్

హెల్త్‌కార్డులు ఇవ్వాలి



డ్రైవర్ వృత్తిలో ఆరోగ్య సమస్యలు సర్వసాధారణమయ్యాయి. ఏదైనా సమస్యతో ఆస్పత్రికి వెళ్తే జేబుకు చిల్లులు పడుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో అధిక బిల్లులు చెల్లించలేక అప్పుల పాలవుతున్నాం. ఆటో డ్రైవర్లకు హెల్త్‌కార్డులు అందించి ఆదుకోవాలి. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి డ్రైవర్లకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలి.
– చాంద్‌పాషా, ఆటో డ్రైవర్

గ్రూప్స్ రాసి డ్రైవర్‌గా..



నేను బీఏ చదువుకుని 2014 నుంచి గ్రూప్స్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. ఇటీవల గ్రూప్– 1తోపాటు గ్రూప్– 4 పరీక్షలకు కూడా హాజరయ్యా. ఇప్పటికే గ్రూప్– 1 రెండుసార్లు రద్దు చేశారు. నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో ఆటో డ్రైవర్‌గా జీవనం గడుపుతున్నా.
– జయరాజ్, ఆటో డ్రైవర్

బీమా అమలు చేయాలి



ఎన్నికల సమయంలో పోటీలో ఉండే నాయకులు చేసిన వాగ్దానాలను తర్వాత పట్టించుకోరు. సామన్యుల గురించి ఆలోచించరు. ఆటో డ్రైవర్‌గా చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించడం ఇబ్బందిగా మారింది. ఆటో డ్రైవర్లను ఆదుకోవడానికి ప్రత్యేక బీమా పథకం అమలు చేయాలి.
– ఎస్కే సలీం, ఆటో డ్రైవర్, ఆసిఫాబాద్

క్లుప్తంగా

'నవోదయలో' ప్రవేశానికి గడువు పెంపు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లోని 9, 11వ తరగతుల్లో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 7వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 2024 ఫిబ్రవరి 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ల ప్రతిపాదికన భర్తీ చేయడం జరుగుతుందని, అర్హులైన వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94412 64035 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్, ట్యాలీ, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7095780999 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఫలించిన బుజ్జగింపులు

కాసిపేట: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై అసంతృప్తితో మండలంలోని వైస్ ఎంపీపీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పార్టీ మారేందుకు సిద్ధపడగా అధిష్టానం చేపట్టిన బుజ్జగింపులు ఫలించాయి. ఎంపీ వెంకటేష్‌నేత, ఓసీసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాంమోహన్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావుతో చర్చించారు. మంత్రి కేటీఆర్ వారితో ఫోన్‌లో మాట్లాడి అసంతృప్తి చెందవద్దని, మీకు మేమున్నామని, పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. దీంతో నాయకులు బీఆర్ఎస్‌లో కొనసాగేందుకు అంగీకరించారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చెన్నూర్: గజ్వేల్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, పెండ్యాల లక్ష్మణ్, కొండపర్తి వెంకటరాజం, నాయిని సతీశ్, ఏలేశ్వరం నర్సింహాచారి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నెన్నెల: తెలంగాణ ఎరుకల సంఘం నెన్నెల మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు, ప్రధాన కార్యదర్శి లోకిని రవి, నస్పూర్ మండల అధ్యక్షుడు కెంసారం సారయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.



లెక్క దాటితే చిక్కే!

- ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చు పక్కాగా ఉండాల్సిందే
- రూ.40 లక్షలు మించొద్దన్న ఎన్నికల సంఘం
- తర్వాత లెక్కలు సమర్పించాల్సిందే..

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు.. ర్యాలీలు.. భోజనాలు, వాహనాలు ఇలా.. ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఎన్నికల రణరంగంలో పైచేయి సాధించడానికి అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిర్దేశించింది. వీటిని పక్కాగా అమలు చేయడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించింది. సభ్యులు నిత్యం పరిశీలిస్తూ ఖర్చు లెక్కిస్తారు. హద్దు దాటితే అనర్హత వేటు పడే ప్రమాదమూ ఉంది. అభ్యర్థులూ.. తస్మాత్ జాగ్రత్త.

నామినేషన్ నుంచి అమల్లోకి...

ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికల ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరిచి దానిద్వారానే లావాదేవీలు నిర్వహించాలి. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాలు సంబంధిత పార్టీల ఖర్చు కింద జమ చేస్తారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు.

లెక్క చూపకున్నా వేటే...

ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోపు ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్కరూ తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, వ్యయానికి సంబంధించిన లెక్కలను సరైన సమయంలో చూపకున్నా సంబంధిత వ్యక్తులపై వేటు పడటంతో పాటు తర్వాతి ఎన్నికల్లో పోటీచేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది.

రూ.40 లక్షల వరకే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారం నిమిత్తం ఈసీఐ వ్యయ పరిమితిని రూ.40 లక్షల వరకు నిర్దేశించింది. పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలను ఆధారాలతో చూపకున్నా అభ్యర్థులపై వేటు వేసేలా ఎన్నికల సంఘం నిబంధనలు ఉన్నాయి.

నిరంతరం నిఘా

నామినేషన్ తర్వాత అభ్యర్థులు చేసే ప్రతీ కార్యక్రమాన్ని పరిశీలకులు నీడలా వెంటాడుతారు.

- అభ్యర్థులు ప్రచారాలు, సభలు సమావేశాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. వాటి ప్రకారం ఆయా కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు వీడియోలు తీసుకుంటారు.
- అనంతరం వాటిని పరిశీలించి సభలు, సమావేశాలకు ఎన్ని కుర్చీలు వేశారు, ఎన్ని టెంట్లు వేశారు. ఎన్ని మైక్‌సెట్లు పెట్టారు. ఎన్ని వాహనాలు వచ్చాయి, ఎంత మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఖర్చు లెక్కించి షాడో రిజిస్టర్లో నమోదు చేస్తారు. అభ్యర్థులు కూడా పోలింగ్ నాటికి ఖర్చు వివరాలను మూడు పర్యాయాలు అకౌంటింగ్ టీంతో తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఆహార పదార్థాలు

లీటర్ నీటి సీసా	: రూ.20
చికెన్ బిర్యానీ	: రూ.140
మటన్ బిర్యానీ	: రూ.180
పులిహోర	: రూ.30
భోజనం	: రూ.80
సమోసా	: రూ.10
టిఫిన్	: రూ.35
చాయ్	: రూ.7

అద్దె గది

గెస్ట్ హౌస్ ఏసీ(సింగిల్)	: రూ.1,150
గెస్ట్ హౌస్ (డబుల్స్)	: రూ.1600
హోటల్స్ నాన్‌ఏసీ	: రూ.800
డ్రైవర్స్	: రూ.400

వాహనాల అద్దె

డీసీఎం వ్యాన్	: రూ.3,000
మినీ బస్	: రూ.3,500
ఇన్నోవా	: రూ.4,000
బస్	: రూ.6,000
జీపు	: రూ.1,200
టెంపో (ట్రావెలర్)	: రూ.2,600
సుమో, క్వాలీస్, కారు	: రూ.1,250
టవేరా	: రూ.1,575
బొలెరో	: రూ.1,450
స్కార్పియో	: రూ.1,875
ఆటో	: రూ.500

ఎన్నికల సంఘం నిర్దేశించిన అభ్యర్థుల రోజువారీ ఖర్చు వివరాలు

- మైకులు 2, ఆంప్లిఫేర్ 1, మౌత్ పీస్ : రూ.1,300
- మైకులు 12, ఆంప్లిఫేర్ 1, మౌత్ పీస్ 3 : రూ.4,200
- మినీసభ స్టేజీ, లైటింగ్, సౌండ్స్ రూ.8 వేల నుంచి రూ.12 వేలు
- వీఐపీ కుర్చీ సింగిల్ రూ.270, డబుల్ రూ.375
- టెంటు 18/36: రూ.1,500, 12/24 : రూ.800
- క్లాత్ బ్యానర్ : రూ.325 నుంచి రూ.380
- కటౌట్ ఉడెన్ : రూ.270
- క్లాత్ కటౌట్, ఆర్చ్ : రూ.1,520,
- ఫ్లెక్సీ 12/8 : రూ.1,800
- వీడియోగ్రఫీ : రూ.1,850
- డ్రోన్ కెమెరా : రూ.5,000

చెన్నూర్‌కు మంత్రుల చరిత్ర

- నాటి నుంచి నేటి వరకు ముగ్గురికి మంత్రివర్గంలో చోటు
- చెన్నూర్ నుంచి గెలిస్తే మంత్రి పదవి..!


రాజమల్లు బోడ జనార్దన్ గడ్డం వినోద్

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి 1952 నుంచి ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరుగగా 8 మంది శాసన సభకు ఎన్నికయ్యారు. నాడు రాష్ట్రంలోనే వెనుకబడిన నియోజకవర్గంగా గుర్తింపు ఉండడంతో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వారిలో ముగ్గురికి మంత్రివర్గంలో చోటు దక్కింది. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన బోడ జనార్దన్, గడ్డం వినోద్ కార్మికశాఖ మంత్రులుగా, కోదాటి రాజమల్లు ఆరోగ్యశాఖ మంత్రిగా సేవలందించారు. అభివృద్ధిలో తమ మార్క్‌ను సొంతం చేసుకున్నారు.

కోదాటి రాజమల్లు

1962లో చెన్నూర్ ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కోదాటి రాజమల్లు విజయం సాధించారు. 1962 నుంచి 1972 వరకు మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన రాజమల్లు మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆయన హయాంలోనే చెన్నూర్‌లో 30 పడకల ఆస్పత్రి నిర్మించారు.

బోడ జనార్దన్

బోడ జనార్దన్ అటవీశాఖలో పనిచేస్తున్న సమయంలోనే 1985లోనే తెలుగుదేశం పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వచ్చింది. 1985 నుంచి 1999 వరకు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు.

గడ్డం వినోద్

మాజీ ఎంపీ స్వర్గీయ గడ్డం వెంకటస్వామి తనయుడు గడ్డం వినోద్ 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి బోడ జనార్దన్‌పై విజయం సాధించారు. తెలుగుదేశం కంచుకోటలో పాగా వేసిన వినోద్‌కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా అవకాశం దక్కింది. ఆయన హయాంలో చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో 133 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి కృషి చేశారు.

'బౌండ్‌డౌన్' అంటే తెలుసా?

నెన్నెల(బెల్లంపల్లి): ఇప్పటి వరకు బైండోవర్ అంటే అందరికీ తెలుసు. బౌండ్‌డౌన్ అంటే చాలా మందికి తెలియదు. బైండోవర్ అంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి ఒప్పందం కుదుర్చుకుంటారు. అవసరమైతే ఒకరి పూచికత్తు తీసుకుని బాండ్ పేపర్ రాయించుకుంటారు. బాండ్ పేపర్‌లో పేర్కొన్న జరిమానా చెల్లించకుంటే పూచికత్తు ఇచ్చిన వారి నుంచి వసూలు చేసే వీలుంది. దీనినే బైండోవర్ చేయడం అంటారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాదు.. పండుగల సందర్భంలోనూ బైండోవర్ చేస్తుంటారు.

వర్తింపు ఇలా...

బైండోవర్ సమయంలో ఇచ్చిన మాటను అతిక్రమించడమే బౌండ్‌డౌన్. వ్యక్తిగతంగా హాజరై రాతపూర్వకంగా ఇచ్చిన హామీని మితిమీరడం అంటే చట్టాన్ని ఉల్లంఘించడమే. అయితే ఇది క్రిమినల్ కేసు కాదు. పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం లేకపోయినా ఈ విషయాన్ని తహసీల్దార్‌కు నివేదించవచ్చు. వాటికి అనుగుణంగా ఆ అధికారి చర్యలు తీసుకోవచ్చు. బైండోవర్ అయిన వ్యక్తి శిక్ష తప్పించుకునేందుకు పై కోర్టులను ఆశ్రయించవచ్చు. ఇదంతా బౌండ్‌డౌన్ చేసిన వారి వివరాలతో పోలీసులు రిపోర్ట్ చేసినప్పుడే వీలవుతుంది. కానీ చాలా సందర్భాల్లో పోలీసులు అంత వరకు వెళ్లడం లేదు.

తహసీల్దార్‌కు న్యాయపరమైన అధికారాలు

మండల రెవెన్యూ అధికారి అంటే తహసీల్దార్ అనుకుంటాం. కానీ ఆయన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కూడా. ఆయనకు కొంతవరకు న్యాయపరమైన


నెన్నెలలోని తహసీల్దార్ కార్యాలయం

అధికారాలు కూడా ఉంటాయి. ఈ కారణంగా పోలీసులు బైండోవర్ చేసే సమయంలో తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. బైండోవర్ తర్వాత ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పు రాకపోతే సమండ్లు జారీ చేసేందుకు జైలుకు పంపించే అధికారం తహసీల్దార్‌కు ఉంది. తప్పు, నేరాన్ని బట్టి బైండోవర్ సమయంలో నిర్దేశిత జరిమానా (రూ.500 నుంచి రూ.లక్ష) విధిస్తుంటారు. మొత్తాన్ని నిర్ణయించవచ్చు. వీటిని చలానా రూపంలో రాష్ట్ర ఖజానాకు చెల్లించాల్సి ఉంటుంది.

ముహూర్తం మంచిగున్నదా..!

- నామినేషన్ ఎప్పుడు వేయాలి?
- పండితులను వాకబు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

నిర్మల్‌ఖిల్లా: నవంబర్ 3 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండడంతో ఆయా రాజకీయ పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్న వారు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గ్రామాల బాట పట్టారు. టికెట్లు ఖరారైన అభ్యర్థులంతా నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ నామినేషన్లు స్వీకరించేందుకు జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లను ఎప్పుడు వేస్తే బాగుంటుందో ముహూర్తాల కోసం పండితులను సంప్రదిస్తున్నారు. ముహూర్తం ఎప్పుడు బాగుంది? నామినేషన్ ఏ రోజు వేస్తే విజయావకాశాలు ఉంటాయో చెప్పాలని పండితులను అడుగుతున్నారు. తమకు విజయం చేకూరేలా మంచి ముహూర్తం చూడాలని కోరుతున్నారు. నవంబర్ 3, 6, 9 తేదీల్లో నామినేషన్లు వేసేందుకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు బ్రాహ్మణ పండితులు పేర్కొంటున్నారు. దీంతో ఆయా తేదీల్లోనే నామినేషన్లను దాఖలు చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

హజ్గుల్‌లో కొండచిలువ కలకలం

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్లాట్ల వద్ద కొండ చిలువ కనిపించింది. 8.5 అడుగుల కొండ చిలువను గ్రామస్తులు హతమార్చారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

సారంగపూర్(నిర్మల్): మండలంలోని ఆలూరు గ్రామానికి చెందని నాకిడి మల్లయ్య(45) అప్పుల బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల వివరాల ప్రకారం.. మల్లయ్య రెండేళ్ల క్రితం డెయిరీ ఫాం పెట్టడానికి స్థానికంగా అప్పులు చేశాడు. లాభాలు రాక తీవ్రంగా నష్టం రావడంతో డెయిరీఫాం నిర్వహణ చేయలేక దానిని విక్రయించాడు. అయితే డెయిరీఫాం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబీకులకు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఆయన కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

బెల్లంపల్లి: పట్టణంలో మంగళవారం ఓ బాలుని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. బెల్లంపల్లి బస్తీ ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మార్కెట్ ఏరియాకు చెందిన బాలుడు (17) గంజాయి సేవిస్తూ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద 130 గ్రాముల గంజాయి లభ్యమైంది. బల్లార్షా నుంచి గంజాయిని తెచ్చి ఈప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తుండటంతో పాటు తాను కూడా సేవిస్తున్నట్లు అంగీకరించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో ఊర చెరువు వద్ద మంగళవారం గంజాయి సేవిస్తూ యువకుడు పోలీసులకు పట్టుబడినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. అతని వద్ద 5 గ్రాముల గంజాయి లభించినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ అదనపు ఎస్సై హరిశేఖర్ పెట్రోలింగ్‌కు వెళ్లగా పోలీసుల వాహనాన్ని గమనించిన మల్యాల చందు అనే యువకుడు పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని వెంబడించి పట్టుకోగా 5 గ్రాముల గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా దీపావళి బోనస్ ఇప్పిస్తాం


మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులకు వారం రోజుల్లోగా దీపావళి బోనస్ ఇప్పించనున్నట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో కార్మికులతో మాట్లాడారు. వారంలోగా యాజమాన్యం కార్మికులందరికీ బోనస్ చెల్లించేలా టీబీజీకేఎస్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మారిన వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశ్, నాయకులు కైత స్వామి, ఓరం కిరణ్, రామ్మోహన్, శ్యాం సుందర్, మల్లేశ్, రాజమౌళి, రాజేశం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీఎఫ్‌గా శాంతారామ్ బాధ్యతల స్వీకరణ


పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ జోన్, కాళేశ్వరం సర్కిల్‌కు సీసీఎఫ్‌గా (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఎస్.శాంతారామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, అటవీ శాఖ అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న అటవీశాఖ అధికారులతో పాటు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో కలిసి పనిచేస్తూ అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తానన్నారు.

అత్యాచారం కేసులో ఒకరికి పదేళ్ల జైలు

మందమర్రిరూరల్(చెన్నూర్): మహిళపై అత్యాచారం కేసులో ఒకరికి పదేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఊరు మందమర్రికి చెందిన మహిళను 2018, జనవరి 8న మండలంలోని బురదగూడెంకు చెందిన మేశినేని కార్తీక్ పత్తిచేనులోకి లాక్కెళ్లి చంపుతానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదేరోజు బాధితురాలు మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు. అడిషనల్ పీపీ పులి రాయమల్లు 11 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

వైభవంగా శత లక్ష్మీనారాయణ యాగం


యాగంలో పాల్గొన్న సుమన్ దంపతులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): క్యాతనపల్లిలోని ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వగృహంలో మంగళవారం శత లక్ష్మీనారాయణ యాగం వైభవంగా నిర్వహించారు. శృంగేరి పీఠం వేదపండితులు వేదబ్రహ్మశ్రీ గోపీకృష్ణ బృందం ఆధ్వర్యంలో యాగంలో భాగంగా పూర్ణాహుతి పూజ చేశారు. సకల జనుల సంక్షేమం, అభివృద్ధి కోరుతూ పూర్ణాహుతి హోమం నిర్వహించినట్లు ఎమ్మెల్యే సుమన్ తెలిపారు.

మద్యం పట్టివేత

బెల్లంపల్లి: పట్టణంలోని శాంతిఖని బస్తీకి చెందిన మునిమంద అంకులు వద్ద మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. కాంటా ఏరియాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అంకులు వద్ద ఆఫీసర్స్ చాయిస్ 90ఎంఎల్ బాటిళ్లు 20 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు


గాయపడిన రాము, హన్మంతు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్ సమీపంలో మంగళవారం కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం రెబ్బెన మండల కేంద్రానికి చెందిన సయ్యద్ లతీఫ్ తన ఆటోలో గంగాపూర్‌కు ప్రయాణికులతో వెళ్తుండగా అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న గంగాపూర్‌కు చెందిన హన్మంతు, లతీఫ్, మూడేళ్ల బాలుడు రాముకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను రెబ్బెన పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు.

ఇట్యాలలో పత్తి పంట ధ్వంసం


పత్తిపంటను పరిశీలిస్తున్న ఎస్సై సనత్‌కుమార్

దహెగాం: మండలంలోని ఇట్యాలలో బుద్దె గురువయ్య అనే రైతుకు చెందిన పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. గురువయ్య ఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రెండెకరాల్లో పత్తి పంటను ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పరిశీలించిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం ఇట్యాల గ్రామానికి వెళ్లి ధ్వంసమైన పత్తి పంటను పరిశీలించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు.



ఆధార్ అప్‌డేట్‌కోసం జిల్లాలో సరిపడా కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గల ఆధార్ కేంద్రం వద్ద రోజుకు 25 నుంచి 30 మందికి మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తుండడంతో పదిహేను రోజులుగా రద్దీ కొనసాగుతోంది. అదనంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– దండేపల్లి(మంచిర్యాల)